క్లుప్తంగా

నేడు లంగర్‌హౌస్‌లో ఇఫ్తార్

గోల్కొండ: కార్వాన్ నియోజకవర్గం లంగర్ హౌస్ మెహిదీ కాలనీలో నేడు ఇఫ్తార్ విందు ఏర్పాటు చేస్తున్నామని కార్వాన్ ఎమ్మెల్యే కౌసర్ మొహియుద్దీన్ తెలిపారు. ఈ ఇఫ్తార్ విందుకు హైదరాబాద్ ఎంపీ మజ్లిస్ పార్టీ అధినేత అసదుద్దీన్ ఒవైసీ హాజరుకానున్నారని ఆయన తెలిపారు.

కళ్లద్దాల పంపిణీ



కళ్లద్దాలు పంపిణీ చేస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు ఆశీష్‌కుమార్ యాదవ్

అబిడ్స్: ఆశీష్‌కుమార్‌యాదవ్ ఆయుష్ కేంద్రం ద్వారా పూల్‌బాగ్‌లో మెగా హెల్త్ క్యాంప్‌లో అర్హులైనవారికి కళ్లద్దాలు పంపిణీ చేశారు. సోమవారం బీఆర్‌ఎస్ నాయకులు ఆశీష్‌కుమార్‌యాదవ్ ఆధ్వర్యంలో ఉచితంగా ఆయన స్థానికులకు కళ్లద్దాలను పంపిణీ చేపట్టారు.

షేక్‌పేట్‌ను ఆదర్శ డివిజన్‌గా తీర్చిదిద్దుతా



ఐమాస్ట్ లైట్లను ప్రారంభిస్తున్న షేక్‌పేట్ కార్పొరేటర్ రాషెద్ ఫరాజ్

గోల్కొండ: షేక్‌పేట్‌ను ఆదర్శ డివిజన్‌గా తీర్చిదిద్దుతానని బల్దియా స్టాండింగ్ కమిటీ సభ్యుడు, షేక్‌పేట్ కార్పొరేటర్ మహ్మద్ రాషెద్‌ఫరాజుద్దీన్ అన్నారు. మజ్లిస్ సీనియర్ నాయకులు మహ్మద్ రహ్మతుల్లా తయ్యబ్‌తో కలిసి సోమవారం ఆయన మినీ గుల్షన్ కాలనీ, లక్ష్మణ్‌నగర్ కాలనీల్లో ఐమాస్ట్ లైట్లను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తాను వరుసగా రెండో సారి కార్పొరేటర్‌గా ఎన్నికైన నాటి నుంచి ప్రణాళికబద్ధంగా అభివృద్ధి చేశానన్నారు. డివిజన్ పరిధిలోని పాత బస్తీలతో పాటు కొత్తగా వెలిసిన కాలనీలలో అన్ని రకాల అభివృద్ధి పనులు చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో మజ్లిస్ ఏరియా నాయకులు జహీర్‌భాయ్, రహీం తదితరులున్నారు.

సందడిగా స్నాతకోత్సవం



గన్‌ఫౌండ్రీ: విద్యార్థులను ఉన్నత పౌరులుగా తీర్చిదిద్దడంలో ఇగ్నో విశ్వవిద్యాలయం కృషి అభినందనీయమని తెలంగాణ రాష్ట్ర రెవెన్యూశాఖ ముఖ్య కార్యదర్శి నవీన్‌మిట్టల్ అన్నారు. సోమవారం బషీర్‌బాగ్‌లోని నిజాం కళాశాలలో ఇగ్నో 36వ స్నాతకోవం వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యా విధానంలో వస్తున్న మార్పులకు అనుగుణంగా కార్యక్రమాలను రూపొందించి అనేక రంగాల్లో విద్యార్థులకు ఉపాధి అవకాశాలు కలిగేలా ప్రముఖ పాత్ర పోషిస్తున్నట్లు తెలిపారు. అనంతరం ఇగ్నో హైదరాబాద్ శాఖ డిప్లొమా, డిగ్రీ విద్యార్థులకు సర్టిఫికెట్లను ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో నిజాం కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ భీమానాయక్, ఇగ్నో ఇన్‌చార్జ్ ప్రాంతీయ సంచాలకులు డాక్టర్ రమేష్, సహాయ సంచాలకులు బి.రాజు, అసిస్టెంట్ రిజిస్ట్రార్ రమణ పాల్గొన్నారు.

ఈసీ ఏఎన్‌ఎంలను రెగ్యులర్ చేయాలి



సుల్తాన్‌బజార్: రాష్ట్రవ్యాప్తంగా 2003, 2009 నుంచి పని చేస్తున్న దాదాపు 700 మంది యూరోపియన్ కమీషన్ (ఈసీ) ఏఎన్‌ఎంలను ఎటువంటి షరతులు, పరీక్షలు లేకుండా జీఓ నంబర్ 16లో చేర్చి తక్షణమే రెగ్యులర్ చేయాలని ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు ఎండీ. యూసఫ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఏఐటీయూసీ ఆధ్వర్యంలో కోఠిలోని హెల్త్ అండ్ మెడికల్ ఫ్యామిలీ వెల్ఫేర్ కమిషన్ కార్యాలయం ఎదుట నిర్వహించిన ధర్నాకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. 2002లో డీఎస్సీలో రాత పరీక్షలు రాసి మెరిట్ ప్రకారం.. రూల్ ఆఫ్ రిజర్వేషన్‌లో అన్ని నిబంధనలు పాటిస్తూ, రోస్టర్ విధానాన్ని కూడా పాటిస్తూ వారు ఎంపిక అయ్యారాన్నారు. అలా ఎంపిక అయిన వారందరూ ప్రస్తుతం రెగ్యులర్ అయి నెలకు లక్ష రూపాయల జీతం తీసుకుంటున్నారని కానీ ఈసీ ఏఎస్‌ఎంలు మాత్రం ఇంకా కాంట్రాక్టు ఉద్యోగిగా ఉంటూ రూ.27 వేలు మాత్రమే జీతం తీసుకుంటున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ రాష్ట్ర సమితి సభ్యులు రామాంజనేయులు, ఈసీ ఏఎస్‌ఎంలు మంజుల, విజయలక్ష్మి, హసీనా, అనిత, రాజ్యలక్ష్మి, నవీన్, సుమతి, అమృత పాల్గొన్నారు.

ప్రశాంతంగా 'పది' పరీక్షలు ప్రారంభం



సంతోష్‌నగర్‌లో పరీక్ష కేంద్రం వద్ద రూమ్ నంబర్ వెతుక్కుంటున్న విద్యార్థులు

సంతోష్‌నగర్: సంతోష్‌నగర్ డివిజన్ పరిధిలో సోమవారం పదో తరగతి వార్షిక పరీక్షలు ఉరుకులు పరుగుల మధ్య ప్రారంభమయ్యాయి. ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు పరీక్షలు కొనసాగాయి. విద్యార్థులకు పరీక్ష కేంద్రాల్లో అన్ని సౌకర్యాలను కల్పించారు. విద్యార్థులు సమయానికంటే ముందుగానే పరీక్ష కేంద్రాలకు చేరుకున్నారు. విద్యార్థులను క్షుణ్ణంగా తనిఖీలు చేసిన అనంతరమే పరీక్ష కేంద్రానికి అనుమతించారు. డివిజన్ పరిధిలో మొత్తం పది పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేయగా.. అన్ని పరీక్ష కేంద్రాల వద్ద సీసీ కెమెరాలను సైతం ఏర్పాటు చేశారు.

బహదూర్‌పురాలో..

బహదూర్‌పురా: బహదూర్‌పురా నియోజకవర్గంలోని పలు ప్రాంతాల్లో సోమవారం పదో తరగతి పరీక్షలు ప్రారంభమయ్యాయి. ఉదయం 9 గంటల నుంచి పరీక్షలు ప్రారంభం కాగా.. అరగంట ముందుగానే విద్యార్థులు పరీక్ష కేంద్రాలకు చేరుకున్నారు. మొదటి రోజు పరీక్షలు ప్రశాంతంగా జరిగాయని విద్యాశాఖ అధికారులు తెలిపారు. మండల పరిధిలోని 48 కేంద్రాల్లో పరీక్షలు జరిగాయన్నారు. ఇందులో 10,134 మంది పరీక్షలు రాయాల్సి ఉండగా మొదటి రోజు 200 మంది పరీక్షలకు గైర్హాజరయ్యారన్నారు.

ఆసిఫ్‌నగర్ మండల పరిధిలో..

విజయనగర్‌కాలనీ: 10వ తరగతి పరీక్షలు సోమవారం ప్రారంభమయ్యాయి. ఆసిఫ్‌నగర్ మండల పరిధిలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లోని కేంద్రాలలో 11453 మంది విద్యార్థులకు గాను 11382 మంది విద్యార్థులు పరీక్షకు హాజరయ్యారని ఆసిఫ్‌నగర్ మండలం గోల్కొండ జోన్ ఉప విద్యాధికారి బానోతు వెంకటేశ్వర్లు తెలిపారు.



పరీక్ష కేంద్రం వద్ద విద్యార్థుల తనిఖీలు

జీఓ నంబర్: 58, 59 ద్వారా క్రమబద్ధీకరణ



తహసీల్దార్ ఎంవీవీ.ప్రసాద్

అబిడ్స్: ప్రభుత్వ భూముల్లో ఉన్న వారు క్రమబద్ధీకరించుకునేందుకు దరఖాస్తు చేసుకోవాలని నాంపల్లి మండల తహసీల్దార్ ఎంవీవీ.ప్రసాద్ వెల్లడించారు. జీఓ నంబర్: 58 ప్రకారం.. 125 గజాలలోపు ప్రభుత్వ భూమి ఉన్నవారికి ఉచితంగా పట్టాలు ఇస్తామన్నారు. జీఓ నంబర్: 59 ప్రకారం.. 125 గజాలకు పైగా ఉన్నవారు ప్రభుత్వ నిబంధనల ప్రకారం.. ఫీజు చెల్లించినచో ఆ భూములను రిజిస్ట్రేషన్ చేస్తామని ఆయన పేర్కొన్నారు. సోమవారం తన కార్యాలయంలో తహసీల్దార్ ప్రసాద్ మాట్లాడుతూ.. ప్రభుత్వ, షీలింగ్ భూముల్లో ఇళ్లు నిర్మించుకుని లేదా తన స్వాధీనంలో ఉన్నవారెవరైనా ఈనెల 30వ తేదీ లోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు. 2020 జూన్ 2వ తేదీ ముందు ఇళ్లు నిర్మించుకున్నవారు దరఖాస్తు చేసుకుంటే జీఓ నంబర్:58, 59లకు అర్హులని ఆయన అన్నారు. ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రభుత్వం పేద బడుగువర్గాల ప్రజల కోసం జీఓ నంబర్: 58, 59ను ప్రవేశపెట్టిందని సూచించారు. అర్హులైన ప్రతిఒక్కరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని తమ ఇళ్లను క్రమబద్ధీకరించుకోవాలని ఆయన అన్నారు.

ప్రమాదాలకు నిలయంగా చాంద్రాయణగుట్ట జంక్షన్

చాంద్రాయణగుట్ట: చాంద్రాయణగుట్ట కొత్త ఫ్లై ఓవర్ కింది చౌరస్తా ప్రమాదాలకు నిలయంగా మారింది. ఎలాంటి సిగ్నల్ వ్యవస్థ ఏర్పాటు చేయని కారణంగా అటు సంతోష్‌నగర్ వైపు వెళ్లే వాహనాలు.. ఇటు చాంద్రాయణగుట్ట పాత పోలీస్ స్టేషన్ వైపు వెళ్లే వాహనాలతో గజిబిజి గందరగోళం నెలకొంటుంది. ఈ సమయంలోనే ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. తాజాగా సోమవారం ఉదయం సంతోష్‌నగర్ వైపు వెళుతున్న ఆర్టీసీ బస్సు కిందికి కందికల్ గేట్ వైపు వెళ్లేందుకు ద్విచక్ర వాహనదారుడు దూసుకురావడంతో అతని కాలు



చాంద్రాయణగుట్ట జంక్షన్‌లో ఇష్టానుసారంగా వెళుతున్న వాహనాలు



ప్రమాదం జరిగిన బస్సు ఇదే..

విరిగింది. ఇలా ఈ జంక్షన్‌లో ప్రమాదాలు నిత్యకృత్యమయ్యాయి. ముఖ్యంగా పహాడీషరీఫ్ నుంచి సంతోష్‌నగర్ వైపు వెళ్లే వాహనదారులు చాలా వరకు చాంద్రాయణగుట్ట ఠాణా నుంచి రాంగ్ రూట్‌లో వస్తూ ఇదే జంక్షన్ నుంచి రాకపోకలు సాగించడాన్ని అరికట్టాల్సిన అవసరం ఉంది. ప్రమాదాలు జరగకుండా సిగ్నల్ వ్యవస్థ లేనియెడల కనీసం స్పీడ్ బ్రేకర్లు అయినా ఏర్పాటు చేయాలని వాహనదారులు కోరుతున్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

గోల్కొండ: రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి చెందిన ఘటన లంగర్‌హౌస్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. షాబాద్ మండలం షేరిగూడ గ్రామానికి చెందిన అరుణ్ కుమార్‌గౌడ్ (22) గత కొన్ని సంవత్సరాలుగా వికారాబాద్ జిల్లా పుల్కచెర్ల మండల కేంద్రంలోని తమ అమ్మమ్మ ఇంటి వద్ద ఉంటూ పనులు చేసుకుంటున్నాడు. సోమవారం అతడు నగరానికి వచ్చి పని ముగించుకుని స్వస్థలానికి బైక్‌పై బయలుదేరాడు. లంగర్‌హౌస్ మిలటరీ ఆస్పత్రి వద్ద నుంచి ఇతను వెళ్తుండగా వెనక నుంచి వేగంగా వచ్చిన గుర్తుతెలియని వాహనం ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో అరుణ్‌కుమార్‌గౌడ్ తీవ్రంగా గాయపడ్డాడు. కాగా అతనికి పోలీసులు చికిత్స నిమిత్తం గోల్కొండ ఏరియా ఆస్పత్రికి తీసుకువెళ్లారు. పరిస్థితి విషమంగా ఉండటంతో అతనిని ఉస్మానియా ఆస్పత్రికి తరలించాడు. కాగా చికిత్స పొందుతూ సోమవారం సాయంత్రం మృతి చెందాడు. కాగా మృతుడి ఫోన్‌తో పోలీసులు ధంబ్ ఇంప్రెషన్ తీసుకుని అతని కుటుంబ సభ్యులతో సమాచారం ఇచ్చారు. కేసు దర్యాప్తులో ఉంది.

కాంగ్రెస్ పార్టీ పోస్టుకార్డు ఉద్యమం



జావేద్ నుంచి పోస్టుకార్డును అందుకుంటున్న వెంకటేశ్

చార్మినార్: రాహుల్ గాంధీ లోక్‌సభ సభ్యత్వంపై అనర్హత వేటు వేయడాన్ని తప్పుబడుతూ కాంగ్రెస్ పార్టీ పోస్ట్ కార్డు ఉద్యమాన్ని చేపడుతుందని చార్మినార్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి కె.వెంకటేశ్ పేర్కొన్నారు. ఈ మేరకు గాంధీభవన్‌లో సోమవారం నిర్వహించిన సమావేశంలో ఏఐసీసీ సెక్రటరీ, రాష్ట్ర వ్యవహారాల శాఖ ఇన్‌చార్జి నదీమ్ జావేద్, యువజన కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు శివసేనా రెడ్డి చేతుల మీదుగా పోస్ట్ కార్డులను వెంకటేశ్ అందుకున్నారు. ఈ సందర్భంగా వెంకటేశ్ మాట్లాడుతూ.. రాహుల్‌గాంధీ ఎంపీ సభ్యత్వం రద్దును ఖండిస్తూ రద్దు చేసిన లోక్‌సభ సభ్యత్వం వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేస్తూ భారత ప్రధానమంత్రికి పోస్ట్ కార్డుల ద్వారా లేఖలు రాసి పంపించడం జరుగుతుందన్నారు.

మోదీ సభను విజయవంతం చేయాలి



బీజేపీ సమావేశంలో దేవర శ్రీనివాస్ తదితరులు

గోల్కొండ: రాష్ట్రంలో బీఆర్‌ఎస్ ప్రభుత్వం కొనఊపిరితో ఉందని బీజేపీ రాష్ట్ర నాయకులు దేవర శ్రీనివాస్ అన్నారు. సోమవారం గుడిమల్కాపూర్‌లో బీజేపీ ముఖ్య పదాధికారుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఖాన్‌ల ప్రభుత్వంగా మారిందని, ముఖ్యమంత్రి కుటుంబ సభ్యులే భారీ అవినీతి కుంభకోణాల్లో కూరుకుపోయారన్నారు. బీఆర్‌ఎస్ అవినీతి పాలనతో రాష్ట్ర ప్రజలు విసుగెత్తిపోయారని రాష్ట్ర ప్రజలందరూ నేడు బీజేపీని ఆదరిస్తున్నారని ఆయన అన్నారు. దేవర వంశీ మాట్లాడుతూ.. రాష్ట్రంలో ప్రజలకు జవాబుదారీ ఇవ్వలేని ముఖ్యమంత్రి తన పార్టీని జాతీయ పార్టీగా ప్రకటించుకోవడం విడ్డూరమన్నారు. ఈనెల 8న నగరంలో జరగనున్న ప్రధాని మోదీ సభకు గుడిమల్కాపూర్ డివిజన్ నుంచి భారీగా తరలివెళ్తామని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో నామా యాదగిరి, రాధాకృష్ణయాదవ్, అశ్విన్ మోది, ప్రభు పూజారి పాల్గొన్నారు.

14న పంజగుట్టలో అంబేడ్కర్ విగ్రహం ఏర్పాటు



అంబేడ్కర్ విగ్రహాన్ని పరిశీలిస్తున్న వీహెచ్

గన్‌ఫౌండ్రీ: పంజగుట్ట చౌరస్తాలో ఈనెల 14న అంబేడ్కర్ విగ్రహాన్ని ప్రతిష్ఠిస్తున్నట్లు మాజీ రాజ్యసభ సభ్యుడు వీహెచ్. హన్మంతరావు తెలిపారు. గతంలో జీహెచ్‌ఎంసీ అధికారులు తొలగించిన అంబేడ్కర్ విగ్రహాన్ని గోషామహల్ స్టేడియంలో భద్రపరచగా సోమవారం ఆయన ఆ విగ్రహాన్ని పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. పంజగుట్టలో అంబేడ్కర్ విగ్రహాన్ని పెట్టడానికి ప్రభుత్వం ఒప్పుకున్నందుకు కృతజ్ఞతలు తెలిపారు. డాక్టర్ బీఆర్.అంబేడ్కర్ రాజ్యాంగంలోని ఆర్టికల్ 3 లేకపోతే తెలంగాణ వచ్చేదా అని ప్రశ్నించారు. అందరి సమక్షంలో అంబేడ్కర్ విగ్రహాన్ని అదే స్థలంలో ప్రతిష్ఠిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో యువజన కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు శివసేనా రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రాబోయే ఎన్నికల్లో గెలుపే ధ్యేయంగా పని చేయాలి



మాట్లాడుతున్న మహ్మద్ సలావుద్దీన్ లోధీ

చార్మినార్: రాబోయే ఎన్నికల్లో గెలుపే ధ్యేయంగా ప్రతి ఒక్కరూ పని చేయాల్సిన అవసరం ఉందని బీఆర్‌ఎస్ పార్టీ చార్మినార్ నియోజకవర్గ ఇన్‌చార్జి మహ్మద్ సలావుద్దీన్ లోధీ అన్నారు. ఆత్మీయ సమ్మేళనం కార్యక్రమంలో భాగంగా ఆదివారం పత్తర్‌గట్టి డివిజన్‌లో జరిగిన కార్యకర్తల సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. డివిజన్ స్థాయిలోని బూత్ లెవల్ కమిటీని మరింత పటిష్టం చేయాల్సిన అవసరం ఉందన్నారు. ఎక్కడైనా కమిటీలు లేకపోతే వెంటనే నియమించాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు పుస్తే శ్రీకాంత్, నాయకులు నర్సింగ్‌రావు, మహ్మద్ సైఫుద్దీన్, మహ్మద్ ఫారుఖ్, మహ్మద్ ఇస్మాయిల్, సనాబేగం పాల్గొన్నారు.

ఉత్సాహంగా గ్రాడ్యుయేషన్ డే

గోల్కొండ: టోలిచౌకి సూర్యనగర్ కాలనీలోని బచ్‌పన్ స్కూల్ గ్రాడ్యుయేషన్ డే సోమవారం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా కిండర్ గార్టెన్ పూర్తి చేసుకున్న చిన్నారులు గ్రాడ్యుయేషన్ డ్రెస్‌లో తమ పట్టాలను అందుకుంటూ సంబురపడ్డారు. ఈ సందర్భంగా బచ్‌పన్ డైరెక్టర్ ఇందూలతారెడ్డి మాట్లాడుతూ.. విద్యార్థుల జీవితంలో కిండర్ గార్టెన్ కీలక ఘట్టమని, అది పూర్తి చేయడం విద్యార్థులతో పాటు వారి తల్లిదండ్రులకు కూడా ఎంతో గర్వకారణమన్నారు. మున్ముందు చదువులపై చిన్నారులకు చదువులపై మరింత ఆసక్తి కలుగుతుందని ఆమె అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఉసామా సుల్తానా, అకాడమిక్ కో ఆర్డినేటర్ అమీనా భాను, నూరిబింతే ఫరీద్, ఫర్హా తదితరులున్నారు.



వీళ్లు మారరా...?

చాంద్రాయణగుట్ట: నిన్న మొన్నటి వరకు కాస్త నిర్మానుష్యంగా ఉన్న రోడ్లు, మరుగుగా ఉన్న ప్రాంతాల్లో చెత్తను పడేసిన కొందరు తాజాగా ఫ్లై ఓవర్‌ను కూడా వదలడం లేదు. ఛత్రినాక, బోయిగూడ పరిసర రోడ్లపై పడేస్తున్న చెత్త పాయింట్లను గుర్తించి ఆయా ప్రాంతాల్లో జీహెచ్‌ఎంసీ అధికారులు అవగాహన బ్యానర్లు ఏర్పాటు చేశారు. దీంతో ఇళ్లల్లోని చెత్తను బైక్‌లపై తీసుకొస్తున్న వాహనదారులు కందికల్ ఫ్లై ఓవర్‌పై పడేస్తున్నారు. ఫ్లై ఓవర్ ఎక్కే వాహనదారులు దుర్వాసనతో సతమతమవుతున్నారు. ప్లాస్టిక్ కవర్లలో చెత్త వేస్తుండడంతో.. వర్షం వచ్చినప్పుడు ఆ కవర్లు రోడ్డుపైకి వచ్చి ద్విచక్ర వాహనదారులు కింద పడి ప్రమాదాలకు గురవుతున్నారు. ఈ విషయంలో ఇక్కడ చెత్త పడేయకుండా జీహెచ్‌ఎంసీ అధికారులు చేపట్టాలని వాహనదారులు కోరుతున్నారు.



మహిళలు ఆర్థికంగా బలపడాలి



మహిళలకు పొదుపు సంఘాల పాస్‌బుక్‌లు అందజేస్తున్న ఎమ్మెల్యే కౌసర్

గోల్కొండ: మహిళలు ఆర్థికంగా ఎదిగితేనే వారి కుటుంబాలు ఆర్థికంగా బలపడుతాయని కార్వాన్ ఎమ్మెల్యే కౌసర్ మొహియుద్దీన్ అన్నారు. సోమవారం ఆయన టోలిచౌకి మేరాజ్ కాలనీలోని తన కార్యాలయంలో 12 స్వయం పొదుపు సంఘాల సెల్ఫ్, హెల్ప్ గ్రూపులకు మంజూరైన పాస్ బుక్‌లను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 12 పొదుపు సంఘాలతో కలిపి మొత్తం రూ.1.2 కోట్లు మంజూరు అయ్యాయని, ఈ నిధులతో మహిళలు ధైర్యంగా తాము ఎంచుకున్న వ్యాపారాలు చేసుకోవచ్చని ఆయన అన్నారు. నేటి మహిళలు ఆలోచనలు ప్రజల అభిరుచులకు అనుగుణంగా ఉన్నాయని ఆయన అన్నారు. అంతే కాకుండా గత సంవత్సరం కంటే ఈ సంవత్సరం మహిళా పొదుపు సంఘాల సంఖ్య పెరిగిందని ఆయన అన్నారు. మహిళల్లో వ్యాపారం చేయాలన్న ఆలోచన పెరిగిందన్న విషయం ఇది స్పష్టం చేస్తుందని ఆయన అన్నారు. గతంలో వలె కాకుండా పొదుపు సంఘాల మహిళలు తమ వ్యాపారాలను విస్తరిస్తున్నారని, దీని ద్వారా మరికొందరు మహిళలకు ఉపాధి కల్పించిన వారవుతున్నారని ఆయన అన్నారు. కాగా వ్యాపారాలను కేవలం లాభార్జన దృష్టితో కాకుండా దీర్ఘకాలం వ్యాపారం కొనసాగేలా చూడాల్సిన అవసరం ఉందని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో టోలిచౌకి డివిజన్ మజ్లిస్ నాయకులు హారూన్ ఫరాన్, మజిద్, సయ్యద్ జబ్బార్‌తో పాటు పొదుపు సంఘాలకు చెందిన అస్మా తదితరులున్నారు.

'పెన్షన్ కాన్స్టిట్యూషనల్ మార్చ్‌ని విజయవంతం చేయాలి'



నిరసన వ్యక్తం చేస్తున్న నరేందర్‌రావు తదితరులు

సుల్తాన్‌బజార్: పెన్షన్ కాన్స్టిట్యూషనల్ మార్చ్‌ని విజయవంతం చేయాలని టీఎస్‌సీపీఎస్ ఎంప్లాయిస్ యూనియన్ హైదరాబాద్ జిల్లా అధ్యక్షుడు నరేందర్‌రావు పిలుపునిచ్చారు. ఈ మేరకు అబిడ్స్‌లోని భీమాభవన్‌లో సీపీఎస్ విధానాన్ని రద్దు చేయాలని కోరుతూ అబిడ్స్ భీమాభవన్‌లో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సీపీఎస్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అనంతరం నరేందర్‌రావు మాట్లాడుతూ.. రాష్ట్రంలో సీపీఎస్ విధానాన్ని రద్దు చేయాలని కోరుతూ రాష్ట్ర కార్యవర్గం పిలుపు మేరకు ఏప్రిల్ 16న ప్రతి జిల్లా కేంద్రంలో పెన్షన్ కాన్స్టిట్యూషనల్ మార్చ్‌ను నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సంఘం రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు పవన్, జిల్లా కార్యదర్శి సత్యనారాయణ, ఉపాధ్యక్షులు అశోక్‌రెడ్డి, జిల్లా అసోసియేట్ అధ్యక్షులు మహేందర్, శ్యామ్‌సిందర్, అరవింద్, శ్రీనివాస్‌రావు, సుధాకర్, మోహన్‌సింగ్, ఆనంద్, సత్యనారాయణ పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణకు చట్టబద్ధత కల్పించాలి



నాంపల్లి బీజేపీ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహిస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

సుల్తాన్‌బజార్: ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణకు తక్షణమే చట్టబద్ధత కల్పించాలని డిమాండ్ చేస్తూ సోమవారం ఎమ్మార్పీఎస్ నాయకులు అరుణ్‌కుమార్ మాదిగ ఆధ్వర్యంలో నాంపల్లిలోని బీజేపీ కార్యాలయం ముందు మహా ధర్నాను చేపట్టారు. అనంతరం అరుణ్‌కుమార్ మాదిగ మాట్లాడుతూ.. ఎస్సీ రిజర్వేషన్ వర్గీకరణకు 29 ఏళ్లుగా మందకృష్ణ మాదిగ నాయకత్వంలో జరుగుతున్న ఉద్యమానికి మొదటి నుంచి మద్దతుగా నిలిచిన బీజేపీ 100 రోజుల్లో వర్గీకరణ చేస్తామని హామీ ఇచ్చిందని గుర్తుచేశారు. కేంద్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చి 9 ఏళ్లు అవుతున్నా ఈ కాలంలో అనేక చట్టాలు తీసుకువచ్చింది కానీ వర్గీకరణను మాత్రం నిర్లక్ష్యం చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఎస్‌ఎఫ్ జాతీయ అధ్యక్షుడు సోమశేఖర్, హైదరాబాద్ జిల్లా ఇన్‌చార్జ్ వీఎస్.రాజు, లత, నర్సింహ, శ్రీను, గణేష్, జనపాల మహేష్ పాల్గొన్నారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి



ఏఎంఓహెచ్ శ్రీకాంత్‌రెడ్డితో కలిసి పర్యటించిన బీఆర్‌ఎస్ నాయకులు ఆనంద్‌కుమార్ గౌడ్

అబిడ్స్: ఈనెల 6న హనుమాన్ జయంతిని పురస్కరించుకుని ఆలయాల పరిసరాలు, బస్తీలు, ఇతర ప్రాంతాల్లో పరిశుభ్రం చేయాలని గోషామహల్ నియోజకవర్గం బీఆర్‌ఎస్ నాయకుడు ఆనంద్‌కుమార్‌గౌడ్ సూచించారు. జీహెచ్‌ఎంసీ 14వ సర్కిల్ ఏఎంఓహెచ్ డాక్టర్ శ్రీకాంత్‌రెడ్డితో కలిసి గౌలిగూడ రామమందిర్, గౌలిగూడ, నకాజ్‌గల్లీ ప్రాంతాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా ఆనంద్‌కుమార్ గౌడ్ మాట్లాడుతూ.. అన్ని ప్రాంతాల్లో చెత్తాచెదారం లేకుండా జీహెచ్‌ఎంసీ సిబ్బంది ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు. ఆలయాల పరిసరాల్లో ప్రతిరోజూ పరిశుభ్రత చేపట్టాలని ఆయన అన్నారు. ఏఎంఓహెచ్ డాక్టర్ శ్రీకాంత్‌రెడ్డి మాట్లాడుతూ.. ప్రతి ప్రాంతంలో పర్యటించి పరిశుభ్రత చేపడుతామన్నారు. ఈ కార్యక్రమంలో ఉమా, భాస్కర్, మహేష్, శ్రీనివాస్, భాగ్య, పింకి, లలిత, శకుంతల, మురళి, రాకేష్, శ్రీశైలం పాల్గొన్నారు.

కఠోర హౌస్‌లో వ్యర్థాల తొలగింపు

గోల్కొండ: కఠోర హౌస్ అభివృద్ధిపై ఎట్టకేలకు అధికారులు నడుంబిగించారు. కఠోర హౌస్ కొంత కాలంగా డంపింగ్ కేంద్రంగా మారింది. గత సంవత్సరం కఠోర హౌస్‌ను ఆనుకుని ఉన్న రోడ్డు కుంగిపోయింది. దీంతో రోడ్డు మట్టి మొత్తం కఠోర హౌస్‌లో గుట్టలా పేరుకుపోయింది. ఈ మట్టి, వ్యర్థాల తొలగింపు ఆదివారం ప్రారంభమైంది. ఇదిలా ఉండగా అధికారుల నిర్లక్ష్యం కారణంగా కఠోర హౌస్ అభివృద్ధికి నోచుకోవడం లేదని స్థానికులు అంటున్నారు. కఠోర హౌస్ చుట్టూ ఫెన్సింగ్ లేకపోవడంతో గుర్తు తెలియని వ్యక్తులు ఆటో ట్రాలీలలో చెత్తను డంపింగ్ చేస్తున్నారు. ప్రధాన రహదారికి అవతలి వైపు ఉన్న కఠోర హౌస్ వైపు స్థానికులు కుప్పలు తెప్పలుగా వ్యర్థాలను తెచ్చి పోస్తున్నారు. చెత్త తొలగింపు పనులు పూర్తి కాగానే కఠోర హౌస్ చుట్టూ ఫెన్సింగ్ చేయాలని స్థానికులు కోరుతున్నారు.



కఠోర హౌస్‌లో వ్యర్థాలు, మట్టిని తొలగిస్తున్న దృశ్యం

శ్రీనివాసాచార్యులకు భారత్ ఐకాన్ అవార్డు ప్రదానం



అవార్డును అందుకుంటున్న శ్రీనివాసాచార్యులు

సంతోష్‌నగర్: సంతోష్‌నగర్‌లోని పద్మావతి గోదా సమేత వేంకటేశ్వర స్వామి ఆలయ ప్రధాన అర్చకులు నల్లదీగల శ్రీనివాసాచార్యులకు సోమవారం భారత్ ఐకాన్ అవార్డును ఆర్.కె.కళ సాంస్కృతిక ఫౌండేషన్ ఆధ్వర్యంలో ప్రదానం చేశారు. టూరిజం శాఖ చైర్మన్ ఉప్పల శ్రీనివాస్ గుప్తా, ఆర్.కె.కళ సాంస్కృతిక ఫౌండేషన్ నిర్వాహకులు రంజిత్ కుమార్ చేతుల మీదుగా శ్రీనివాసాచార్యులు ఈ అవార్డును అందుకున్నారు. ఈ సందర్భంగా శ్రీనివాసాచార్యులు మాట్లాడుతూ.. వేంకటేశ్వర స్వామికి చేసిన సేవలకు తనకు ఈ పురస్కారం లభించడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. ఈ సందర్భంగా ఆలయ చైర్మన్ కె.యుగంధర్‌రెడ్డి, ఆలయ ఈఓ జయంతి శ్రీనివాసాచార్యులకు అభినందనలు తెలియజేశారు.